అస్తిత్వనదం ఆవలి తీరాన

## కథాపరిచయం

# వీరకుంకుమ

"వీరకుంకుమ" - ఈ శతాబ్ది గొప్ప తెలుగు కథల మొదటిపదింటిలో తప్పక చేరుతుంది. ప్రతాపరెడ్డి, ఆదెమ్మ చిట్టిరెడ్డి, రాజు- పాత్రలను ఎవ్వరూ మరిచిపోలేరు. భారత దేశానికి గుండెకాయ వంటి పల్లెటూళ్ళ హృదయ స్పందనం ఈ కథలో వినబడుతుంది. కరువు కోరల్లో చిక్కిన ఆవు "పుల్లన్న" పాత్రను గూడా చిరస్మరణీయం చేశారీ కథలో రాజుగారు. రాయలసీమ సాంఘిక జీవనపు లాండ్‌స్కేప్‌ను చిత్రించటం వల్ల, ఈ కథలో విషాద సుందరిత గాంభీర్యంతో పరచుకొంది. రాజుగారి ఆంధ్రాభిమానం ఆనాటి విశాలాంధ్రావతరణ, సురుచిర సుందరస్వప్నం పరమోత్తేజకంగా, ఈ కథలో దర్శనమిస్తుంది. తరతరాల సంస్కృతిపట్ల చాలా ఇష్టంవున్న అచ్చ తెలుగు కథకుడు శ్రీమునిపల్లెరాజు. శ్రీ చింతాదీక్షితులు రాసిన 'దాసరిపాట' తర్వాత అంతగొప్పకథ - ఈ వీరకుంకుమ. రాజుగారి కథల్లో ఒక భావుకహృదయోద్వేగం కనిపించే కథల్లో ఈ కథను ముందుగా చెప్పాలి."

- డా॥ అక్కిరాజు రమాపతిరావు (మంజుశ్రీ)

అంగీరస

ఉగాది - 1992

మునిపల్లె రాజు

# వీరకుంకుమ

తల్లిగర్భంలో, వెచ్చగా హాయిగొలిపే మసకమసక తమస్సులు కల్పించిన అమరశాంతిలో, నిరామయుడై బుద్ధుడి వదనంతో, జీసస్ హృదయంతో, నిండు తొమ్మిదినెలలు తపస్సు చేసిని చిన్నప్రతాపరెడ్డి - కెవ్వున కేకవేస్తూ, ధాతకరువు మిత్తియజ్ఞంతో మానవ జాతిమీద కసి తీర్చుకొంటున్న ప్రకృతి ఒడిలో పడ్డాడు. కరువులో పోయినవాళ్లుపోగా, యింకా చావుతో పెనుగులాడి బ్రదికి వున్న అమ్మలక్కలు చేరి - గోపాలకిష్టుడు పుట్టాడు - గోపాలకిష్టుడు పుట్టాడు - అన్నారు - ఆ రోజు శ్రావణ బహుళ అష్టమి కావటంతో వానలూ గుండ్లకమ్మ వరదలూ లేని శ్రావణమది. వర్షర్తువులో గ్రీష్మదేవి తాండవమాడుతోన్న ధాతనామసంవత్సరమది. అప్పటికి నాలుగు నెల్లకిందటే కాటకపు వాతబడ్డ వాగులురెడ్డి లేని అష్టమి అది. నాగులు రెడ్డి అతని తండ్రి.

అమ్మలక్కల దీవనలు పుట్టిన చిట్టివాడు వినలేదు. నిద్రాణమై, వసంతంలోని లేతమామిడిగున్న చిగురువలెవున్న ప్రతాపరెడ్డి ఆత్మ, ఒక్క క్షణం తలెత్తి పరికించి స్తంభించిపోయింది. ఈ భయానక లోకమా, ఈ దయలేని ప్రకృతా తన క్రీడారంగం?

పిల్లవాడు పుట్టిన నాలుగురోజుల్లోనే తల్లిగూడా చనిపోయింది. జేజెమ్మ - ఒళ్ళోకి తీసుకొని, అందరూ గోపాలక్రిష్టుడి పేరు పెట్టమని బలవంతం చేస్తుంటే, వినక- "నువ్వు ప్రతాప రెడ్డివిరా, దరిద్రుడా !" అన్నది బిడ్డడిని చూసి, ముడుచుకొన్న గుప్పిటవిప్పి ప్రతాపరెడ్డి జేజెమ్మ పమిటె పట్టుకొన్నాడు. అతని ఆత్మభయంతో, దిగులుతో వణికిపోయింది. దిగులులో పుట్టి, దిగులులో పెరిగాడు రెడ్డి.

ఐదేళ్ళు వచ్చింతర్వాతగాని ప్రతాపరెడ్డి బాగా నడవలేదు. కాని దొడ్డికాళ్లుపోయి, దృఢంగా తరతరాలనుండి సంక్రమించిన బిగువుతో నునుపుగా పెరిగాడు. జేజెమ్మ కథలు జెప్పింది. ఊగొట్ట కుండా దిగులుతో విన్నాడు. పొలంలో, జేజెమ్మతో పాటు వచ్చిన వాడు మంచెకింద చేరి, ఎర్రబారుతూన్న సాయంత్రాన్ని జూచి, భయపడి , చందమామలో పొన్నచెట్టుకింద పాతగుడ్డలు కుట్టుకొంటున్న ముసలమ్మకు,ఎవరు బువ్వ బెడతారో తెలియక, జేజెమ్మ నడిగితే తిడుతుందని వణికి దిగులుతో నిద్రించి కలవరించి పెద్దవాడైనాడు. రాయలపురంలో అప్పటికి బడిలేదు. అందువల్ల ప్రతాపరెడ్డి

చదువుకోలేదు. అందుకని మళ్లీ దిగులు.

దిగులు మధ్యనే జీవన నిర్మాణం ప్రారంభమయింది. చీనితోటలో పెదబావినుండి మోటదోలుతూ నూనూగుమీసాల యువకుడైనాడు. అంతలోనే జేజెమ్మ చచ్చిపోయింది- నూటపదేళ్ళు బదికి, ముడతలతో, జాలువారినకండలతో, జరతో నడవలేక నడుము వంగిన తన జేజెమ్మగతేగదా - తనకుగూడా ఒకనాడు గాకుంటే మరొకనాడైనా? జొన్నచేల కొఁడ్ర, బుడ్డిచీనితోట ముసలి ఆవు, దాని పెయ్యదూడా - జేజెమ్మ మట్టిమిద్దె- ప్రతాపరెడ్డికి మిగిలినప్పటికి. వాటినుండే జీవితాన్ని, సాధించి, సృష్టించి, ప్రతియేడూ పొంచివున్న కరువుతో పోరాటం సాగిస్తూ. జొన్నచేలో మంచెనుండి వడిశెల విసురుతూ, పొరుగురైతు కూతురు అన్నమ్మను, కోతరోజుల్లో కూలీలకు చల్లన్నం దోసిళ్లలో పోస్తూండగా చూచి, మనసుపడి పెళ్లిచేసుకొన్నాడు. ఇంటివాడైన తర్వాత ప్రతాపరెడ్డిని కొత్తదిగులు వరించింది. అన్నమ్మ నోరు అశనిపాతం వంటింది. నోరు పారేసుకోటంలో తనకు తనే సాటి. "బంగారమంటి గుండె గాని తాటిమట్టవంటి నాలిక"- అని పాపిరెడ్డి భార్య అన్నది. అన్నమ్మ నోటికి అలవాటు పడ్డాడు. కాని అన్నమ్మ కడుపు పండలేదు. ప్రతాపరెడ్డి నోరు కదపకుండా తన ఎదలోని దిగులును, తన మనసును పిండి, కఱకఱమని నమిలి కొఱుకుతూన్న కొరతను తనలోనే దాచుకున్నాడు. కాని జీవితయాత్ర సాగి పోతూనే ఉంది. మహానంది తిరనాళ్లకు ప్రభ గట్టించి తన యెడ్ల జతను ముందు నిలిపాడు. అర్జీలకు ఆరా లేకపోతే పదిమందినీ సై అనిపించి, ఊరజెఱువులో తుమ్మల్ని పడగొట్టించి, పూడిక దీయించి, నిటారుగా కట్టలు బోయించి, మాలపల్లెకు గూడా కడపబండల్తో కొత్తరేవు గట్టించి సెభాసనిపించుకొన్నాడు. పిచ్చిరెడ్డిగారి మిర్చిమడి తగాయిదాకు పంచాయితీ అయి పెదరెడ్డికాడ తక్కిన పంచాయితీ దార్లు యింతో అంతో తిని అబద్ధమాడితే, తను నిక్కచ్చిగా నిలబడి, పిచ్చిరెడ్డి యింటి దీపం నిలిపాడు. తన పుణ్యఫలమేమో- తన జుట్టు నెరిసే యీడున అన్నమ్మ కడుపు పండి, సంక్రాంతిరోజుల్లో చిట్టిరెడ్డి పుట్టాడు.

చిట్టిరెడ్డి పుట్టింతర్వాత, ప్రతాపరెడ్డి జీవితంలో ఒక అర్థం, గమ్యం, లక్ష్యం అవుపించినాయి. చిట్టిరెడ్డి తనలాగా కరువులో పుట్టలేదు. సంక్రాంతిలో పుట్టాడు. ధాన్యలక్ష్మితో పాటువచ్చాడు యింటిలోకి. తనలాగా చీనితోట మోటచుట్టూ బుల్లి ఛర్నాకోలతో తిరిగాడు. మంచెమీదికి గుంజ నెగబాకి ఎక్కి వడిశెల విసరటం నేర్చుకొన్నాడు. అన్నమ్మ నోటిధాటికి తనవంక జూచి, తనకు మాత్రమే అర్థమయ్యే చిరునవ్వుతో పెదిమ విరిచి తప్పుకోటం అలవాటుపడ్డాడు. ఈ చిట్టిరెడ్డి తన తర్వాత చీనితోట సంగీతం విని ఆనందించే వారసుడు. తన తర్వాత జొన్నచేను తలపంకించి

తల గుడ్డను కన్నుగీటినప్పుడు అదిలించి మంచెమీదికెక్కి రివ్వుమనిపించగల ఒక గడ్డ పుత్రుడు. తన తర్వాత పంచాయితీగా, మోకాలుకూ, నడుముకూ వుత్తరీయం బిగించి, తన సాంప్రదాయం నిలబెట్టగల యింటిబిడ్డ. ఈ జీవితానికిగాక మరి దేనికి అర్థం?

తన చిట్టిరెడ్డి హయానికైనా తుంగభద్ర కాలవపడి, ఈ భూమిలో బంగారం గనులు గనులుగా దొరకాలని అర్జీపెట్టి వేలు ముద్దర్లు వేశాడు. కాని పోయిన తర్వాత తిరిగి క్షేమం తెలిపే చుట్టాలుగావీ అర్జీలు.

## 2

ప్రతాపరెడ్డి జీవితానికి అర్థం వచ్చింది గాని, అర్థం దిగులును పోగొట్టలేదు. తిరిగి అయిదేళ్ళ కరువు, యిన్నాళ్ళూ పొంచిదాగిన మృత్యువు - వచ్చింది. ఊర జెఱువు ఎండిపోయింది. శ్రావణమూ, రోహిణి కార్తె చెట్టాపట్టాలు పట్టినవి. ఈ రోజుల్లోనే చిట్టిరెడ్డి చదువుమాట వచ్చింది. మిర్చితోట తాకట్టుబెట్టి, డబ్బుతెచ్చి కర్నూలు పంపించాడు కొడుకును. మిరపమడి మాడిపోయినా, జొన్నకంకి కంటికగుపించకపోయినా, చీనితోట ఎండి సంగీతం వినిపించకపోయినా, అడుగుజూపి, కడుపు తరిగిన మోటబావిలో తనమాటలే తిరిగి తిరిగి తనకు వినిపించినా -పక్కనే నుంచొని, ఒక్కచిఱునవ్వుతో, పోయిన ఆశను తిరిగి మరలించగలిగినవాడు. ఎండిన మోడును తిరిగి చిగిర్చగలిగినవాడు, కరువులో దాహం తీర్చే చలివేంద్రంలాగా తనవాడు, తన రక్తంలో రక్తం తనకండలోకండ, తన బిడ్డ,తన ఆశ, తన వారసుడు, తన చిట్టిరెడ్డి - తనవలె పల్లెటూరి మూర్ఖుడు కాబోడు -! అన్నమ్మ చదువెందుకన్నది. నీ కెందుకన్నాడు తను. మిర్చితోట తాకట్టునుండి విక్రయానికి బోయింది. కానిచిట్టిరెడ్డి కాలేజీలోకి వెళ్లాడు.

ఈయేడు, ఈనాడు - అని మురిపించిన మేఘం ఆకాశంలో పలకలేదు. జొన్నచేను గూడా అమ్మివేశాడు. అయితేనేమి? నవ్వుతూ, దూరాన్ని చూచి ఆశ్చర్యపోయి కలలుగనే కళ్లతో, పొందికగల అవయవాల మీద బస్తీ నాగరీకుడి గుడ్డలతో, నడిచిన తన బాటనే ఏదో వెలుగును వెలిగించిన దేవతాకుమారుడి వలె - పరీక్షలు పాసయిన తన కొడుకులేడా? తన్ అంతరంగిక గర్వానికి మూర్తిగా, తన మార్దవంలేని మోటు స్నేహాన్ని అర్థంచేసుకొన్న ఆత్మీయ చెలికాడై తన కొడుకు రాడా? అంతకన్నా మిక్కిలిగా ఆలోచించలేదు ప్రతాపరెడ్డి.

సెలవలకు యింటికొచ్చాడు -చిట్టిరెడ్డి, పొద్దుటినుండీ ఎదురుచూచి, మనసు నిలపలేక, అక్కడికి నాలుగుమైళ్ళున్న బస్సులు వచ్చే రోడ్డుమీద, ఎండిన గానుగుచెట్టు

మొగన నిల్చుని, బస్సురాగానే కొడుకు పెట్టె అందుకొని కరువు సంగతి మరిచి, నడుస్తూ యింటికి తిరిగొచ్చారు - కొడుకు పక్కపక్కనే తాకుతూ నడిచి, అవును, యీ నడకలో గూడా తృప్తివుంది.

కొడుకు అమ్మ సంగతి ఎప్పుడూ అడగడు.

"చిక్కిపోతున్నావు నాన్నా!" అని తండ్రి భుజం తట్టి పొలం మధ్య నిలబడ్డాడు.

"లేదు...లేదు...అంతే....అంతే"

"ఎందుకులేదు? నాకు తెలుసు - జొన్న చేనుగూడా అమ్మేశావుట. ఆ కొత్త ఆసాములకేనా?"

ప్రతాపరెడ్డి మాట్లాడక పెట్టె దించి, ముఖం అటు తిప్పి కొడుకుచేతివేళ్లు, భిడియపడుతూ నొక్కాడు.

"అదుగో.. ఆ దిగులే.." అని చిట్టిరెడ్డి తండ్రి నెరిసిన వెంట్రుకల్లోకి తన కుడిచేయి పోనిచ్చి సర్దాడు. ఇద్దరికీ పెద్ద నవ్వు వచ్చింది.

"దిగులేమిటి? దిగులులేదు. నా చిట్టి వుండగా నా కెందుకు దిగులు?"

"హంపీ వెళ్ళాలి. నా స్నేహితులంతా వెళ్తున్నారు. నువ్వు గూడా రా నాన్నా!"

"ఎందుకులే? నేనెందుకు? నువ్వు పోయిరా"

"నువ్వెందుకేమిటి? మన విజయనగర రాజ్యం సంగతి చెప్తాను. అమ్మ కర్థంగాదు. నువ్వు రావాలి."

"ఖర్చులు..." అనబోయి ప్రతాపరెడ్డి నాలుక గరచుకొన్నాడు. "సరే..ఎప్పుడు?"

"మంగళవారం...." అని కొడుకు జేబులోనుంచి సిగరెట్టు తీసి వెలిగించాడు. తన ముందు కొడుకు యిదివరలో ఎప్పుడూ కాల్చలేదు.

"మా నాన్నకు కోపం రాకేం... చ్చుచ్చుచ్చు... అసలు రాదంటే రాదు" అని పిల్లవాడి గొంతుతో చిట్టిరెడ్డి తండ్రినోట్లోకి యింకొక సిగరెట్టు అందించాడు. పొగవూదుతూ యిద్దరూ పకాలుమన్నారు. అన్నమ్మ వచ్చి .... "ఏమిటీ తంతంతా?" అన్నది నడుం మీద చేతులు వేసుకొని, తండ్రీ కొడుకులు తనుకర్థమైన చిరునవ్వు భాషలో మాట్లాడుకొని చెరొక దారిన పోయారు. ప్రతాపరెడ్డి కళ్ళనిండుగా నీరు తిరిగినది.

ఆ రాత్రి అన్నమ్మ పడమటింటిలో వున్నప్పుడు, ప్రతాపరెడ్డి కావిడి పెట్టె తీసి, బావిలోతు చేయించేందుకు, కో ఆపరేటివు బాంకులో చీనితోట తాకట్టు పెట్టితెచ్చిన మొత్తంలో ఒక వంద తీసుకొన్నాడు.

ప్రతాపరెడ్డి ముద్దగా కూలిపోయాడు.

పుల్లన్న హంతకుణ్ణి నిటారుగా చూచింది. వాడు వెనుదిప్పగానే కొమ్ములు గిటించి, డొక్కల్లో పొడిచి ఎత్తి కుదవేసి, దుమ్ముల్లో పొర్లించింది. అరచి చచ్చిపోయాడు - ప్రతాపరెడ్డి హంతకుడు, మంద చెల్లాచెదురైపోయింది.

పుల్లన్న ఆలస్యం చెయ్యలేదు. ముక్కుతో యజమానిని తాకి వాసన జూసింది. ప్రాణం లేదు. ఆ కట్టెను కొమ్ములతో శిరసుమీది కెక్కించుకొన్నది. ఇంటిదారి బట్టింది. అరుబయట అన్నమ్మ వేచివున్నది.

భర్త శవాన్ని చూచింది. పుల్లన్న వీపునిమిరి ముద్దెట్టుకున్నది. తన పమిటె చెరుగు చించి ప్రతాపరెడ్డి గాయాలకు అడ్డుపెట్టింది. ఆ రక్తం తీసి తన నొసలిమధ్య బొట్టుపెట్టుకొన్నది. కుప్పకూలిపోయింది.

❖ ❖ ❖

ఆ రాత్రి రాజు చనిపోయాడు. చనిపోయేముందు మళ్ళీ పాత కళ వచ్చింది. ఆ ముఖంలోకి - "చిట్టీ. యింటికిపో, అమ్మ వీరకుంకుమ ధరించి నిన్ను పిల్చింది" అన్నాడు.

(ఆంధ్రపత్రిక - విజయ సంవత్సరాది. 1953)

✽ 1952లో రాయలసీమ పర్యటనలో విన్న కొన్ని కథలు ఆధారం

"విఫల మానవావేదనల విస్తృతార్ణవ తీరం నుండి
పిలుస్తున్నాను నేను, నా గీతం వినబడుతోందా నీకు?
..............................................................
నా గీతం చేరక పోవచ్చు నిన్ను
ఐనా పిలువక తప్పదు"

- బైరాగి